క్లుప్తంగా

నూతన కార్యాలయంలో రెవెన్యూ సేవలు



నూతన కార్యాలయంలో తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: ఇక నుంచి రెవెన్యూ సేవలు నూతన తహసీల్దార్ కార్యాలయం నుంచి కొనసాగుతాయని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. సోమవారం ఆమె వినాయక విగ్రహ ప్రతిష్ట, హోమం వంటి ప్రత్యేక పూజల అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలంలోకి ప్రవేశించారు. ఇక నుంచి విధులు నిర్వహిం చేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో డీటీ మాధవ, వీఆర్ఓలు సాంబశివుడు, నాగేష్, రెవనూరు, సావిత్రి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈద్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక నడిగడ్డలోని తాహెరా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 500 మంది నిరుపేదలకు ఈద్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాయల్ స్కూల్ కరస్పాండెంట్ యాకూబ్, అతావుల్లాఖాన్, ఇసాక్‌వలి, ఖాజాహుసేన్, హుసేన్‌బాషా పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ ఆంజనేయ, కోదండ రామస్వామి దేవస్థానం, మూలసాగంలోని శ్రీరామస్వామి ఆలయాల్లో సోమవారం నిర్వహించిన దుకాణాల బహిరంగ వేలంలో ఆలయాలకు అధిక ఆదాయం లభించిందని ఈఓ వేణునాథరెడ్డి, తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ బైటిపేట శ్రీరామాంజనేయ స్వామి దేవస్థానం 1వ షాపు బహిరంగ కౌలు వేలంలో 3 సంవత్సరాలకు, ప్రతినెల రూ.6వేల అద్దెతో అప్పగించామని, గతేడాది కంటే రూ.వెయ్యి అదనంగా వచ్చిందన్నారు. అలాగే మూలసాగరం శ్రీరాం స్వామి దేవస్థానం 2 షాపుల వేలం పాటలో గతఏడాది కంటే రూ.13,200 ఆదాయం సమకూరినట్లు చెప్పారు.

మజ్జిగ పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న బాలికల ఉన్నత పాఠశాల వద్ద సోమవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనశి నాగమహేష్ సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున 300 మంది విద్యార్థులకు పరీక్ష అనంతరం మజ్జిగ అందజేశామని చెప్పారు. మహేష్ మాట్లాడుతూ రోజూ పరీక్ష జరిగే వివిధ పాఠశాలల్లో మజ్జిగ పంపిణీ చేపడతామని చెప్పారు. మామిళ్ల నాగరాజు, పసుపుల రాజశేఖర్, బింగుమాళ్ల జగదీశ్, శేగు ఉపేంద్ర, కూర ప్రసాద్, సందీప్ పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యాక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఆర్.మధుమతి చేత భక్తి రంజని కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గం గం గణపతి వదనం, శివపద భజనా, సర్వమంగళాధవ శివ, అంబా శాంభవి అఖిలాండేశ్వరి, కై లాసగిరిలో ప్రమథ గణములతో, శంబో శివశంభో, హరహర శంకరా జయ జయ శంకరా తదితర గీతాలకు ఆర్.మధుమతి, జి.విశాలాక్షి గాయనీమణులు ఆలపించారు. మృదంగ సహకారాన్ని ప్రసాద్, వయోలిన్ సహకారాన్ని శంకర్ అందించారు.

20న వేలం పాటలు

ఆత్మకూరు: ఈనెల 20న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారపు సంత మార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు ఫీజు, చిన్న కమేళా, పెద్ద కమేళా, చేపలు, చికెన్ విక్రయాల హక్కులకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. వేలం దక్కించుకున్న వారికి ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు విక్రయాల హక్కులు ఉంటాయన్నారు.

చెత్త తొలగింపు చర్యలు చేపట్టండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాలిటీలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ముందు వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ డంప్ యార్డులో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపునకు మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా అధికారులందరూ భాగస్వాములై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 17 ఎకరాల డంపింగ్ యార్డులో సుమారుగా 90 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉందని అందులో 6 ఎకరాల్లో ఉన్న చెత్తను రిక్లేమేషన్ (బయో మైనింగ్) చేసి ఖాళీ భూమిగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని, అయితే ప్రాసెస్ చేసి వాటిని అక్కడి నుంచి తొలగించలేదన్నారు. ఇంకా 10 ఎకరాల్లో ఉన్న చెత్తను రిక్లేమేషన్ ద్వారా మొత్తం తొలగించి ఖాళీ ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. 1889లో నంద్యాల మున్సిపాలిటీగా ఆవిర్భవించినప్పటి నుండి పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు కార్యక్రమాన్ని అతిపెద్ద సవాల్‌గా తీసుకొని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమాయత్తం కావాలన్నారు. ఆదివారం కర్నూలులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గోస్పాడు మండలంలోని కూలూరు, తేళ్లపూరి గ్రామాల్లో తాగునీటి అంశాన్ని ఫీల్డ్ విజిట్ చేసి పరిష్కరించాలన్నారు. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో అనుమతులు లేకుండా నదిలోకి బోట్లు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్తపల్లి మండల పరిధిలో హెవీ లోడ్ వాహనలు తిరుగుతున్న నేపథ్యంలో సంబంధిత నివేదికలు ఇవ్వాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద ఉన్న భూముల ఆయకట్టు వివరాలను బోర్డులు ఏర్పాటు చేసి ప్రదర్శించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాముునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజల అభిప్రాయాలు సేకరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంపై ప్రజాభిప్రాయాలను సేకరించాలని అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్ఓ రాముునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు పరిష్కరించిన 27,854 ఫిర్యాదుదారుల నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,157 దరఖాస్తులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5,444 మంది మిస్సింగ్ సిటిజన్ డేటా, 195 మంది ఎంప్లాయిస్ డేటా, 14,141 హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ డేటా, నందికొట్కూరు,ఆత్మకూరు,ఆళ్లగడ్డ,డోన్‌పట్టణ ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈ, పీ-4 తదితర పెండింగ్ సర్వేలన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి సంస్థల కోసం ప్రభుత్వ స్థలాలను అన్వేషించండి

అభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పార్కులు, కుసుమ్ కార్యక్రమం క్రింద విద్యుత్ సబ్ స్టేషన్లు, రిలయన్స్ సంస్థ వారిచే కంప్రెస్డ్ బయో గ్లాస్ ప్లాంట్లు, స్టార్ హోటళ్లు, ఐటీఐ సంస్థల ఏర్పాటుకు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ స్థలాలను అన్వేషించాలని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లకు 5 – 10 ఎకరాలు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు 50 – 100 ఎకరాలను స్థలాలను గుర్తించాలన్నారు. నంద్యాల జిల్లాకు రెండు స్టార్ హోటల్స్ రానున్నాయని ఇందుకు..రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖలకు చెందిన భూములను గుర్తించాలన్నారు. స్టార్ హోటల్ నిర్మాణానికి 2 – 3 ఎకరాల భూమి అవసరమన్నారు.

ఘనంగా రామ నామ యజ్ఞ సప్తాహం

శిరివెళ్ల: గోవిందపల్లెలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అఖండ శ్రీరామ జయరామ నామ జపయజ్ఞ సప్తాహం కార్యక్రమం ప్రారంభమయ్యింది. అంతకు ముందు అయోధ్య నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీరాముడి భారీ ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో మేళా తాళాలతో ఊరేగించారు. అనంతరం సీతా రామాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ కొలనుభారతి ఉపాసకులు శ్రీ పరమాహంస పరివ్రాజ్యకాచార్య శ్రీ శివయోగేంద్ర సరస్వతీ స్వాములు భక్తులకు విశేష సందేశం వినిపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాముడి భారీ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): చలువ పందిళ్లు, చలివేంద్రాలు, మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మాజీ పార్లమెంట్ కార్యదర్శి సన్నాల సాయిరాంరెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే 15వ వార్డు పరిధిలోని తహసీల్దార్, రిజిస్ట్రేషన్, సబ్ జైలు, ట్రెజరీ, విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయం, పోలీసు స్టేషన్, కోర్టు భవనం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఒకే చోట ఉన్నందున నిత్యం అనేక మంది అవసరాల కోసం వస్తుంటారన్నారు. ఆయా కార్యాలయాల్లో తాగడానికి మంచినీరు, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కౌలు రైతుల సంక్షేమ చట్టాన్ని తేవాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కౌలు రైతుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని తీసుకొని రావాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేసిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 80శాతం మంది భూములు కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నా ప్రభుత్వ సహాయం అందడం లేదన్నారు. గ్రామాల్లో 60 శాతం కౌలు రైతులు ఉన్నారని, గుర్తింపు కార్డులు లేక బ్యాంకు రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవెలకుంట్ల రైతు సంఘం కన్వీనర్ అబ్రహాం, బాషా, గోపాలకృష్ణ, ఇబ్రహీం, రసూల్, రఫీసాహెబ్, ఈశ్వరమ్మ, రజాక్, జమాలయ్య పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): సెకీ ఒప్పందాలను రద్దు చేసి ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు ఈనెల 28వ తేదీన విద్యుత్ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించకుంటే ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలు కాకుండా విద్యుత్ ఉత్పత్తి కంపెనీల ప్రయోజనాలే లక్ష్యంగా పాలకులు తమ విధానాలను రూపొందిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అదానీ కంపెనీల లాభాల కోసమే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఏసురత్నం పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి



రైతులు, అధికారులతో డాక్టర్ సతీష్

నంద్యాల(అర్బన్): విత్తన ధ్రువీకరణ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్ఎస్‌సీఏ(ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్) అథారిటీ డైరెక్టర్ డాక్టర్ సతీష్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మహానంది మండలం తమ్మడపల్లె, నందిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్ఎన్ఆర్-15048, బీపీటీ-5204, ఎన్‌డీఎల్ఆర్-7 విత్తన ఉత్పత్తికి సంబంధించిన వంగడాలను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని కార్యాలయంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట సమయంలో కేళీలను గుర్తించి వాటి నివారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, విత్తనోత్పత్తి దారులు ధ్రువీకరణ అధికారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన విత్తన తయారీకి దోహదపడాలన్నారు. జాయింట్ డైరెక్టర్ రాదిక, సీఎస్‌సీఓ విశ్వనాథ్, ఎస్ఏస్‌సీఓ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం విజయవాడ జిల్లా గుడివాడకు చెందిన జి.వెంకట సత్యనాథ చక్రవర్తి రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టీ.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం తరపున అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించగా పలు ప్రాంతాల భక్తులు పల్లకీని మోస్తూ ఓం నమో మహానందీశ్వరాయ, శ్రీ కామేశ్వరీదేవికి జై..అంటూ ప్రణమిల్లారు. సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

31లోపు రుణాలు చెల్లించాలి

గోస్పాడు: గోస్పాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను ఈనెల 31లోపు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తయిందని సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ తెలిపారు. లావాదేవీల వివరాలను, ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. సంఘం ద్వారా 535 మందికి రూ.3.50 కోట్ల క్రాప్ లోన్లు, రైతు నేస్తం లోను కింద 81 మందికి రూ.3.80 కోట్లు, రాజన్న చేయూత కింద 19 మందికి రూ.40 లక్షలు, దీర్ఘకాలిక రుణాల కింద 21 మందికి రూ.28 లక్షలు అందజేసినట్లు వివరించారు. సీఈఓ అక్తర్‌హుసేన్ ఉన్నారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): టిడ్కో గృహాల్లో సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చివరి రోజు పాదయాత్రలో టిడ్కో గృహాలను పరిశీలించారు. అలాగే నందమూరినగర్, వైఎస్సార్ నగర్‌లలో కాల్వలు, రోడ్లు, వీధి లైట్లు వేయించాలని కోరారు. నరసింహ, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, మౌలాలి, సుబ్బారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, డీఎస్సీ నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు కోరారు. సోమవారం ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్ఓ రాముునాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నాగరాముడు మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహిస్తామని మొదటి సంతకం చేయడంతో లక్షలాది మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో లక్షల్లో ఫీజులు చెల్లించి సిద్ధమవుతున్నారని, అయితే నోటిఫికేషన్ విడుదలకు అదిగో, ఇదిగో అంటుండటంతో వారిలో ఆందోళన నెలకొందన్నారు. విష్ణు, మహేష్ పాల్గొన్నారు.

పొగాకు పంటకు నిప్పు



అగ్నికి ఆహుతైన పొగాకు పంట

బనగానపల్లె: మండలంలోని కాపులపల్లె గ్రామంలో నామాల కృష్ణయ్యకు చెందిన రూ.1.50 లక్షల విలువైన పొగాకు పంట కల్లంలో ఉండగా ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైనట్లు బనగానపల్లె పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రమాదవశాత్తు జరిగిందా ఎవరైనా కావాలనే చేశారా అని విచారణ చేస్తున్నామని తెలిపారు.

బాధ్యులపై చర్యలు

మండలంలోని కాపులపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి, సర్పంచ్ తులసిరెడ్డితో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నామాల కృష్ణయ్యకు చెందిన పొగాకు పంట కాలిపోవడం దురదృష్టకరమన్నారు. దర్యాప్తులో ప్రమాదానికి కారుకులు గుర్తిస్తే వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామస్తులు ప్రశాంతంగా ఉండాలని సూచించారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం



ఉయ్యాలవాడ పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



దొర్నిపాడులో పరీక్షకు ముందు నాన్న దీవెనలు తీసుకుంటున్న విద్యార్థిని శ్రీవల్లి

రుద్రవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 220 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 219 మంది హాజరయ్యారు. ఒకర గైర్హాజరయ్యారు. అలాగే నర్సాపురం మార్తోమా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 178 మందికి గాను 159 మంది పరీక్ష రాయగా 19 మంది గైర్హాజరైనట్లు పాఠశాల పరీక్ష నిర్వాహణ అధికారలు అనురాధ, బాలగురప్ప, సుబ్బరాయుడు తెలిపారు.

తొలిరోజు ప్రశాంతం..

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో 10వ తరగతి పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రంలో మొత్తం 241 మందికి గాను 233 మంది హాజరుకాగా.. 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఛీఫ్ నరసింహుడు తెలిపారు.

దొర్నిపాడు: మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో మొత్తం 181 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివలక్ష్మి తెలిపారు. అలాగే కంపార్ట్‌మెంట్ నలుగురు విద్యార్థులకుగ గాను ఒక్కరే హాజరయినట్ల చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాసరెడ్డి, మారుతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

రాష్ట్ర పరిశీలకుడి తనిఖీ

శిరివెళ్ల: 10వ తరగతి పరీక్షలను సోమవారం జేడీ, రాష్ట్ర పరిశీలకుడు అబ్రహం తనిఖీ చేశారు. శిరివెళ్ల, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించి గదులు, విద్యార్థులకు కల్పించిన వైద్య, తాగునీటి సదుపాయాలపై ఆయా కేంద్రాల చీఫ్‌లను ఆరా తీశారు. కాగా మండలంలో ఏడుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

చాగలమర్రిలో 18 మంది గైర్హాజరు..

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర, ఓరియంటల్ బాలికల, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పరిశీలకులు న్యామతుల్లా, అనురాధ తెలిపారు. పరీక్షలకు 760 మంది విద్యార్థులకు గాను 18 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు.



రుద్రవరం పరీక్ష రాసేందుకు గదిలో కూర్చున్న విద్యార్థులు



తల్లి, సహాయకురాలితో కలిసి పరీక్షకు హాజరైన దివ్యాంగురాలు దాసరి దీప.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ చంద్రుడు పర్యవేక్షించారు.

డ్రైనేజీకి మరమ్మతులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొగ్గులైన్ ప్రధాన రహదారిలో డ్రైనేజీ బ్లాక్ కావడంతో ఇళ్లలోకి మురుగునీరు ప్రవహించడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో చైర్‌పర్సన్ అక్కడికి చేరుకొని డీఈలు, శానిటేషన్ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్‌ను అక్కడికి పిలిపించి వెంటనే మరమ్మతులు చేయించారు. భవిష్యత్‌లో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మున్సిపల్ డీఈని ఆదేశించారు.